ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 280 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 12 మే 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepalledgudem, Kadapa, Ongole









# భారత్, పాక్ చర్చలు వాయిదా.. మోదీ-డోభాల్ ప్రత్యేక భేటీ

ఉద్రిక్తతల వేళ.. భారత్-పాక్ మధ్య జరగాల్సిన డీజీఎంవో స్థాయిలో కీలక చర్చలు వాయిదా పడ్డాయి.

మే 12, (రిపబ్లిక్ న్యూస్): భారత్-పాకిస్థాన్ల మధ్య ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది. ఈ ఒప్పందం, అనంతర పరిస్థితి పై ఇరుదేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం కీలక చర్చలు జరగాల్సి ఉండగా.. ప్రస్తుతం అవి వాయిదా పడ్డాయి. ఈ సాయంత్రం 5 గంటలకు ఈ చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండు దేశాల 'సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్' (డీజీఎంవో)ల మధ్య హాట్లైన్లో చర్చలు జరుగుతాయి. అయితే, వాయిదాకు గల కారణాలు తెలియరాలేదు. మరోవైపు, ప్రధాని మోదీ నివాసంలో రక్షణమంత్రి రాజ్నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోబాల్, త్రివిధ దళాల అధిపతులు, పలువురు ఉన్నతస్థాయి సైనికాధికారులు సమావేశమయ్యారు.



## మోదీ-డోభాల్ ప్రత్యేక సమావేశం

తన నివాసంలో జరిగిన కీలక సమావేశం అనంతరం మోదీతో అజిత్ డోబాల్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారత్, పాక్ చర్చల నేపథ్యంలో వివిధ అంశాలపై వీరు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే.. డీజీఎంవో చర్చల నేపథ్యంలో ఆదివారం మోదీ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ బుల్లెట్లకు ఫిరంగి గుళ్లతో సమాధానం ఇవ్వాలని భారత సైన్యాన్ని ఆదేశించారు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ను భారత్కు అప్పగించడం మినహా కశ్మీర్ అంశంపై పాక్తో ఎలాంటి చర్చలు ఉండవని ప్రధాని స్పష్టం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కశ్మీర్ అంశంలో ఎవరి మధ్యవర్తిత్వమూ అవసరం లేదని తేల్చి చెప్పాయి. ప్రస్తుతం భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లోని నియంత్రణ రేఖ వెంబడి ప్రశాంత వాతావరణం నెలకొంది.

# సాఫ్ట్వేర్, లైఫ్సైన్సెస్ రంగాల్లో జీసీసీ హబ్ హైదరాబాద్:సీఎం రేవంత్ రెడ్డి

సాఫ్ట్వేర్, లైఫ్సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ జీసీసీ హబ్గా మారిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్, మే 12, (రిపబ్లిక్ న్యూస్): సాఫ్ట్వేర్, లైఫ్సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ జీసీసీ హబ్ మారిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్లోని నానక్రామ్గూడలో సొనాటా సాఫ్ట్వేర్ సంస్థను ఆయన ప్రారంభించి మాట్లాడారు.



ఏఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందన్నారు. కొత్తగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షకు పైగా ఉద్యోగాలు సృష్టించినట్లు చెప్పారు. మరిన్ని ప్రపంచస్థాయి కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని వివరించారు. ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో అందరి సహకారం కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

# నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యం:డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

వైద్యరంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని పవన్ కల్యాణ్ కొనియాడారు.

మంగళగిరి, మే 12, (రిపబ్లిక్ న్యూస్): వైద్యరంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో.. రోగులకు స్వస్థత కలిగేలా వృత్తికి గౌరవాన్ని తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. నిస్వార్థంగా వారు అందించే సేవలు వెలకట్టలేనివన్నారు. నర్సుల చేతి స్పర్శ కూడా రోగిలో మానసిక స్థైర్యంతో పాటు సాంత్వన కలిగిస్తుందని తెలిపారు.



అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులతో ఆయన సమావేశం అయ్యారు. ఉత్తమ సేవలు అందించిన ఎనిమిది మందిని సత్కరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరచిపోరు. మీరు పడే శ్రమ, కష్టం నాకు తెలుసు. కొవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించిన విధానం మరువలేం. ఇటీవల సింగపూర్ లో నా కుమారుడు మార్క్ శంకర్ ప్రమాదానికి గురై ఆసుపత్రిలో ఉన్న సమయంలో అక్కడ నర్సులు చేసిన సేవలు చూసినప్పుడు మరోసారి మీ కష్టం గుర్తుకువచ్చింది. మిమ్మల్ని కలసి మీరు అందించే సేవలు మరచిపోలేనివి అని చెప్పి కృతజ్ఞతలు చెప్పాలనుకున్నాను. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలిసే అవకాశం రావడం ఆనందాన్నిచ్చింది. నా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్తాం" అని తెలిపారు.

# రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి:ఎమ్మెల్సీ కవిత

తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు.

హైదరాబాద్, మే 12, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. టీజీఐఐసీలో 1.75 లక్షల ఎకరాలను కేసీఆర్ అందుబాటులో ఉంచారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ భూమిని కుదువపెట్టాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ రహస్య జీవో ఇచ్చారని ఆరోపించారు. అన్ని భూములను స్టాక్ ఎక్స్ఛేంజ్లో కుదువపెట్టేలా జీవో తీసుకొచ్చారన్నారు. మరోవైపు కంచ గచ్చిబౌలి భూములను కుదువ పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారని చెప్పారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు.

"టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారిస్తే ఎందుకు దాచారో సీఎం జవాబివ్వాలి. స్టాక్ ఎక్స్ఛేంజ్లో పెట్టాక 1.75 లక్షల ఎకరాలకు ఎవరిది బాధ్యత? నిపుణుల సిఫార్సు లేకుండా చేస్తే జీవోను ఉపసంహరించుకోవాలి. భూములు కుదువ పెట్టి.. వచ్చిన డబ్బు పక్కదారి పట్టించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. రేవంత్రెడ్డి ప్రభుత్వం రూ.1.80 లక్షల కోట్ల అప్పులు చేసింది. రూ.80 వేల కోట్లు మాత్రమే అప్పులు, వడ్డీల కోసం చెల్లించారు. మిగిలిన రూ. లక్ష కోట్లు ఎక్కడికి పోయాయి? ప్రభుత్వ అప్పులు, వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి.



## పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం..

నేను పార్టీ బలోపేతం కోసమే పని చేస్తున్నా. 47 నియోజకవర్గాల్లో పర్యటనలో వచ్చిన అభిప్రాయాలే చెబుతున్నా. పార్టీపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.. అది సరికాదు. సమయం వస్తే అన్నీ బయటకు వస్తాయి. నన్ను రెచ్చగొడితే ఇంకా గట్టిగా స్పందిస్తాను. నాపై దుష్ప్రచారం విషయంలో పార్టీ స్పందిస్తుందని భావిస్తున్నా" అని కవిత తెలిపారు.

# యుద్ధం అంటే.. బాలీవుడ్ సినిమా కాదు:ఆర్మీ మాజీ చీఫ్

భారత్, పాక్ కాల్పుల విరమణ ఒప్పందం పై పెదవి విరుస్తున్న వారికి ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణే కౌంటర్ ఇచ్చారు. యుద్ధం అంటే బాలీవుడ్ సినిమా కాదన్నారు.



పుణె, మే 12, (రిపబ్లిక్ న్యూస్): భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరుదేశాల మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. అయితే, దీనిపై కొంత వ్యతిరేకత ఎదురవుతున్న వేళ భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణే కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం అంటే బాలీవుడ్ సినిమా కాదని, ఎన్నో కుటుంబాలు తమ ప్రియమైన వారిని కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. దౌత్యానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న నరవణే.. కాల్పుల విరమణ ఒప్పందంపై మాట్లాడారు. "యుద్ధం వల్ల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే పౌరుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. షెల్లింగ్ను చూడగానే చిన్న పిల్లలు సైతం రాత్రి పూట సురక్షిత ప్రాంతాలకే పరిగెత్తాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రియమైన వారిని కోల్పోతే ఆ ఆవేదన తరతరాలను వెంటాడుతుంది" అని ఆర్మీ మాజీ చీఫ్ తెలిపారు. "యుద్ధం అంత రొమాంటిక్గా ఉండదు. ఇదేం బాలీవుడ్ సినిమా కాదు. చాలా తీవ్రమైన అంశం. యుద్ధం అనేది మనం ఎంచుకునే చివరి అవకాశంగా ఉండాలి. అందుకే ప్రధాని మోదీ ఇది యుద్ధాల శకం కాదని చెప్పారు. తెలివితక్కువ వాళ్ల వల్ల బలవంతంగా యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినా.. దాన్ని నివారించేందుకే మనం మొగ్గు చూపాలి. ఇప్పుడు చాలామంది పూర్తిస్థాయి యుద్ధానికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నిస్తున్నారు. సైన్యంలో పనిచేసిన వ్యక్తిగా.. యుద్ధానికి వెళ్లేందుకు నేను సిద్ధమే. కానీ, దౌత్యాన్ని తొలి అవకాశంగా ఎంచుకుంటా. చర్చలతోనే సమస్య పరిష్కారం కావాలని కోరుకుంటా" అని నరవణే వ్యాఖ్యానించారు.

# ఆపరేషన్ సిందూర్ 100% సక్సెస్..

## మోదీ వ్యూహాలు శత్రుదేశం ఊహకు కూడా అందవు:భాజపా

ఆపరేషన్ సిందూర్ వంద శాతం విజయవంతమైందని భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర కొనియాడారు.

ఢిల్లీ, మే 12, (రిపబ్లిక్ న్యూస్): పహల్గాం ఉగ్ర ఘటన అనంతరం ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్కు భారత్ గట్టి జవాబిచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో సరిహద్దుల్లో వాతావరణం కాస్త ప్రశాంతంగా మారింది. ఈనేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వ పటిమను భాజపా కొనియాడింది. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంబిత్ పాత్ర ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు.

ఆపరేషన్ సిందూర్ వంద శాతం విజయవంతమైందని సంబిత్ పాత్రా పేర్కొన్నారు. "మన సైన్యం వంద శాతం విజయం సాధించింది. అది కూడా నియంత్రిత, కచ్చితమైన చర్యల ద్వారా. పాకిస్థాన్లోని కీలక ప్రాంతాలను సైన్యం టార్గెట్గా చేసుకుంది" అని ఆయన వివరించారు. పహల్గాం ఉగ్ర దాడి తర్వాత ప్రతీకారం తీర్చుకుంటామని ప్రధాని నరేంద్ర మోదీ భారత ప్రజలకు హామీ ఇచ్చారని సంబిత్ పాత్ర పేర్కొన్నారు. నరేంద్ర మోదీ వ్యూహాలు శత్రుదేశం ఊహలకు కూడా అందవని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైన్యం తమ సత్తా చాటిందని పేర్కొన్నారు. ఇది అద్భుత విజయమని.. పాకిస్థాన్ భూభాగంలోని సుదూర ప్రాంతాలకు దూసుకెళ్లి.. శత్రు దేశ ఉగ్రవాద శిబిరాలను నిర్మూలించారని.. ఇది నయా భారత్ అని పేర్కొన్నారు. ఒక అణ్వాయుధ దేశం లోతుల్లోకి వెళ్లి దాడి చేయడం ఇదే మొదటిసారని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధాని మోదీ ఐదు లక్ష్యాలను నిర్దేశించుకున్నారని సంబిత్ పాత్ర పేర్కొన్నారు. మొదటిది శత్రు భూభాగంలోని సుదూర ప్రాంతాలకు వెళ్లి దాడి చేయడం.. రెండోది ఉగ్రవాద శిబిరాలను నాశనం చేయడం.. మూడోది వాటిని పూర్తిగా నిర్మూలించడం.. నాల్గోది ఈ ప్రక్రియలో పౌరులెవరూ గాయపడకుండా చూసుకోవడం.. ఐదోది సైనిక మౌలిక సదుపాయాలపై దాడి చేయకుండా ఉండటమని వివరించారు. ఈసందర్భంగా భారత సైన్యం అజేయమైన శక్తిపాటవాలను ప్రదర్శించిందని.. ఉగ్రవాద శిబిరాలను నాశనం చేసిందని కొనియాడారు.



# మద్యం కుంభకోణం.. నిందితులను కఠినంగా శిక్షించాల్సిందే:మంత్రి సత్యకుమార్ యాదవ్

మద్యం కుంభకోణం ద్వారా ప్రపంచం విస్తుపోయేలా వైకాపా నేతలు అవినీతికి పాల్పడ్డారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు.



విజయవాడ, మే 12, (రిపబ్లిక్ న్యూస్): మద్యం కుంభకోణం ద్వారా ప్రపంచం విస్తుపోయేలా వైకాపా నేతలు అవినీతికి పాల్పడ్డారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. ముఖ్యమంత్రే స్వయంగా డిస్టిలరీలు పెట్టడం, సొంత బ్రాండ్లు తయారు చేయించడం లాంటి విడ్డూరం ప్రపంచంలో ఎక్కడా చూడలేదన్నారు. మద్యం కుంభకోణంలో రూ. వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్పారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సదస్సులో సత్యకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2014-19 మధ్య కాలంలో 49 వేల కిడ్నీ కేసులు నమోదైతే... 2019-2024 మధ్య 91 వేలకు పెరిగాయన్నారు. కాలేయ సమస్యలకు సంబంధించిన కేసులు సైతం భారీగా పెరిగినట్లు సత్యకుమార్ తెలిపారు. న్యూరో సంబంధిత కేసులు 380 నుంచి 7,800కి పెరిగినట్లు చెప్పారు. గత ప్రభుత్వ నేతలు నాణ్యతలేని మద్యం తయారు చేయించి లక్షల మంది ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇది క్షమించరాని నేరమని, బాధ్యులను కఠినంగా శిక్షించాల్సిన అవసరముందన్నారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# ఈ తారకరామారావు మా నాన్నంత ఎత్తుకు ఎదగాలి: నారా భువనేశ్వరి

తారక రామారావు – వై.వి.ఎస్.చౌదరి సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.



నందమూరి హరికృష్ణ మనవడు, జానకిరామ్ కుమారుడు.. తారక రామారావు హీరోగా వైవిఎస్.చౌదరి కొత్త సినిమాను తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. 'న్యూ టాలెంట్ రోర్స్' పతాకంపై ఆయన సతీమణి గీత ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నేడు ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా గారపాటి లోకేశ్వరి, దగ్గుబాటి పురందేశ్వరి, నారా భువనేశ్వరి పాల్గొన్నారు. హీరోహీరోయిన్లపై భువనేశ్వరి క్లాప్ కొట్టి అభినందించారు. ఈ చిత్రానికి కీరవాణి సంగీతం అందించనున్నారు. 1980 నేపథ్యంలో రానుంది. తెలుగు భాషకు ఇందులో పెద్దపీట వేయనున్నారు. ఈ సినిమాతో హైందవ సంస్కృతి, తెలుగు భాష గొప్పతనం గురించి ప్రేక్షకులకు చెప్పనున్నట్లు వై.వి.ఎస్.చౌదరి తెలిపారు. ఈ సినిమాకు నేపథ్యమే బలమన్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన కూచిపూడి డ్యాన్సర్, అచ్చతెలుగు అమ్మాయి వీణారావు నటిస్తున్నారు.

"సీనియర్ ఎన్టీఆర్ ఎంత కీర్తి తెచ్చుకున్నారో తారక రామారావు కూడా అలానే ఎదగాలని కోరుకుంటున్నాను. తన ఉనికిని చాటుకోవడం కోసం రామ్ ఎంతో కష్టపడుతున్నాడు. ఆ తపన ఉన్నవారంతా కచ్చితంగా పేరు సొంతం చేసుకుంటారు" – భువనేశ్వరి

"నాన్నకు(సీనియర్ ఎన్టీఆర్) ఎవరూ సాటి రారు. ఆయన లెగసీని ముందుకు తీసుకువెళ్లడానికి ఆయన కుమారులు, మనవళ్లు ఎంతో కృషి చేస్తున్నారు. వారంతా కూడా స్టార్లుగా ఎదుగుతున్నారు. ఇప్పుడు ఆయన మునిమనవడు ఇండస్ట్రీలోకి రానున్నాడు. మీడియా ప్రోత్సాహం అతడికి చాలా అవసరం. అందరూ తారక రామారావును అభినందించండి. వైవీఎస్ చౌదరికి కృతజ్ఞతలు" – లోకేశ్వరి

"ఈరోజు నందమూరి కుటుంబం నుంచి మరో తరం ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. కళాకారుడు ఎంతో తపస్సు చేయాలి. కళామతల్లి ఆశీర్వాదం ఉంటే ఉన్నతశిఖరాలు అధిరోహిస్తాడు. మా నాన్న ఒక కళాతపస్వీ. ఆయన క్రమశిక్షణతో చలనచిత్ర రంగానికి తన జీవితాన్ని అంకితం చేశారు. అందుకే ఆయన పేరును భారతీయ సినీ రంగంలో సువర్ణాక్షరాలతో లిఖించారు. తర్వాత బాలకృష్ణ, హరికృష్ణ ఇద్దరూ కూడా చలనచిత్ర రంగంపై చెదరని ముద్ర వేశారు. ఆ తర్వాత తరం కల్యాణ్, ఎన్టీఆర్ కూడా అంకితభావంతో తమ ఉనికికి చాటుకున్నారు. అలానే ఇప్పుడు మరో తరం పరిశ్రమలోకి వస్తోంది. మేమంతా రామ్ అని పిలుచుకునే ఎన్టీఆర్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్నాడు. అతడికి కూడా కళామతల్లి ఆశీర్వాదంతో పాటు కుటుంబసభ్యుల ఆశీస్సులూ ఉంటాయి. వైవీఎస్ చౌదరికి అభినందనలు" – పురందేశ్వరి

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1965 : అంతర్జాతీయ నర్సుల దినోత్సవం.
- 1820 : లేడీ విత్ ద లాంప్ గా పేరు గాంచిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జననం (మ.1910).
- 1895 : భారతీయ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి జననం (మ.1986). (చిత్రంలో)
- 1920 : జానపద కళాకారిణి, సంగీత దర్శకురాలు వింజమూరి అనసూయ జననం (మ.2019).
- 1924 : నాదస్వర విద్వాంసుడు షేక్ చిన మౌలానా జననం (మ.1999).
- 1937 : అమెరికన్ స్టాండ్–అప్ హాస్యకారుడు, సామాజిక విమర్శకుడు, నటుడు జార్జ్ కార్లిన్ జననం.
- 1985 : భారతీయ శాస్త్రవేత్త బి. విజయలక్ష్మి మరణం.
- 1986 : అమెరికాకు చెందిన 'ఫ్రెడ్ మార్కం' తన రెండుచక్రాల సైకిలు పై, గంటకు 65 మైళ్ళ (104.607 కి.మీ) వేగం సాధించాడు.
- 1992 : ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కిన మొదటి బెల్జియం దేశ మహిళ ఇన్‌గ్రిడ్ బేయెన్స్.



అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



ఫ్లోరెన్స్ నైటింగేల్



జిడ్డు కృష్ణమూర్తి



వింజమూరి అనసూయ



షేక్ చిన మౌలానా



జార్జ్ కార్లిన్



బి. విజయలక్ష్మి



సైకిలు



ఎవరెస్టు

## రిపబ్లిక్ సినిమా

# నయన్ భర్త కొత్త చిత్రం.. రిలీజ్ డేట్ ఎప్పుడంటే..?

నటి నయనతార భర్త, దర్శకుడు విఘ్నేశ్ శివన్ రూపొందిస్తోన్న చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమా రిలీజ్ డేట్ను తాజాగా చిత్రబృందం ప్రకటించింది.



నటి నయనతార భర్త విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహిస్తోన్న చిత్రం 'ఎస్ఐకే' (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ). ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి హీరోహీరోయిన్గా నటిస్తున్నారు. 2023లో పట్టాలెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా చిత్రబృందం రిలీజ్ డేట్ను ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 18న దీనిని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపింది. టైమ్ ట్రావెల్ నేపథ్యంలో ఈ సినిమా సిద్ధమవుతున్నట్లు సమాచారం. అనిరుధ్ స్వరాలు అందిస్తున్నారు.

**వివాదాలు ఎదుర్కొని..!**

ఈ సినిమా విషయంలో విఘ్నేశ్ శివన్ పలు వివాదాలు ఎదుర్కొన్నారు. తొలుత ఈ చిత్రాన్ని నటుడు శివకార్తికేయన్ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై చేస్తున్నట్లు 2019లో వార్తలు వచ్చాయి. అనివార్య కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలోనే 2023లో ప్రదీప్ రంగనాథన్ హీరోగా విఘ్నేశ్ శివన్ ఈ ప్రాజెక్ట్ను అధికారికంగా ప్రకటించారు. మొదట ఈ చిత్రానికి 'ఎల్ఐసీ' (లవ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) అనే టైటిల్ పెట్టారు. దీంతో ఎల్ఐసీ సంస్థ చిత్రబృందానికి నోటీసులు జారీ చేసింది. తమ సంస్థకు ప్రజల్లో మంచి పేరు ఉందని.. సినిమా కోసం ఈ టైటిల్ను ఉపయోగిస్తే సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగే అవకాశం ఉందని పేర్కొంది. వారం రోజుల్లోగా పేరు మార్చకపోతే లీగల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈనేపథ్యంలోనే తమ సినిమా టైటిల్ను 'ఎల్ఐసీ' నుంచి 'ఎస్ఐకే'గా మార్చారు. ప్రస్తుతం ఇది సెవెన్ స్క్రీన్ స్టూడియో పతాకంపై నిర్మితమవుతోంది.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188, 9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## రిపబ్లిక్ స్పోర్ట్స్

### టెస్టులకు విరాట్ కోహ్లి గుడ్బై..

# రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ క్రికెటర్

స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి టెస్టు క్రికెట్కు వీడ్కోలు పలికాడు.




ఇంగ్లాడ్ పర్యటనకు ముందు క్రికెట్ అభిమానులకు బ్యాడ్ న్యూస్. స్టార్ క్రికెటర్, మాజీ సారథి విరాట్ కోహ్లి టెస్టులకు వీడ్కోలు పలికాడు. కెప్టెన్ రోహిత్ శర్మ బాటలోనే అతడు కూడా సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు. ఈ మేరకు ఇన్స్టాగ్రామ్లో భావోద్వేగభరిత పోస్ట్ పెట్టాడు. తాను కూడా టెస్టుల నుంచి రిటైరవ్వాలనుకుంటున్నట్లు ఇటీవల బీసీసీఐకి చెప్పిన కోహ్లి.. తాజాగా దీనిపై అధికారిక ప్రకటన చేశాడు. "14 ఏళ్ల క్రితం తొలిసారిగా టెస్టు క్రికెట్ జెర్సీ ధరించా. ఈ ఫార్మాట్ నన్ను ఇంత దూరం తీసుకెళ్తుందని నేనెప్పుడూ ఊహించలేదు. ఇది నన్ను పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితానికి సరిపడా పాఠాలు నేర్పించింది. తెల్ల జెర్సీలో ఆడటం వ్యక్తిగతంగా నా మనసుకు చాలా ప్రత్యేకమైనది. నిశ్శబ్దమైన ఆనందం.. సుదీర్ఘమైన రోజులు.. ఎవరికీ కన్పించని చిన్న చిన్న క్షణాలు నాతో ఎప్పటికీ ఉంటాయి". "అలాంటి ఈ ఫార్మాట్ నుంచి దూరం జరగడం అంత తేలిక కాదు. కానీ, నా నిర్ణయం సరైనదే అనిపిస్తోంది. ఈ ఫార్మాట్ కోసం నేను ఎంతో ఇచ్చా. నేను ఆశించిన దానికంటే ఎక్కువే ఇది నాకు తిరిగిచ్చింది. మనసు నిండా సంతృప్తితో, కృతజ్ఞతాభావంతో దీని నుంచి వైదొలుగుతున్నా. వెనక్కి తిరిగి నా టెస్టు కెరీర్ను చూసుకుంటే నా ముఖంలో చిరునవ్వు కన్పిస్తుంది. ప్రేమతో ఇక సైనింగ్ ఆఫ్.." అని కోహ్లి తన పోస్టులో రాసుకొచ్చాడు. కాగా.. గతేడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం రోహిత్ శర్మ, కోహ్లి ఒకేసారి పొట్టి క్రికెట్కు టాటా చెప్పారు. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం రోహిత్ టెస్టు క్రికెట్కు రిటైర్మెంట్ ప్రకటించి అభిమానులకు షాకిచ్చాడు. అతడు వైదొలగడంతో ఇంగ్లాండ్ పర్యటనకు కోహ్లి అత్యంత కీలకమవుతాడని అంతా భావించారు. అంతలోనే తాను కూడా రిటైర్ అవ్వాలనుకుంటున్నానని విరాట్ బీసీసీఐకి సమాచారమిచ్చాడు. దీంతో అతడికి సర్దిచెప్పేందుకు బోర్డు ప్రయత్నించింది. కానీ, కోహ్లి మాత్రం తన టెస్టు కెరీర్ను ముగించేందుకే సుముఖత చూపించాడు.

## ఫిట్‌నెస్

# 30 నిమిషాల పాటు నడక లేదా యోగా, ఏది చేస్తే బరువు తగ్గుతారో తెలుసా?

చాలా మంది వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. కానీ, ఏ వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి మేలు జరుగుతుందో చాలా మందికి తెలియదు. కొంతమంది వాకింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిదని నమ్ముతారు. మరికొందరు యోగాకి ఓటేస్తున్నారు.

ప్రస్తుత మారుతున్న జీవనశైలి, పొల్యూషన్, తిండి అలవాట్ల కారణంగా జీవితంలో ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండటం సవాల్‌తో కూడుకుంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటారు. చాలా మంది వ్యాధులకు దూరంగా ఉండాలని అనేక ప్రయత్నాలు చేస్తారు. అయితే, చాలా మంది వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. కానీ, ఏ వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి మేలు జరుగుతుందో చాలా మందికి తెలియదు. కొంతమంది వాకింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిదని నమ్ముతారు. బ్రిస్క్ వాకింగ్ వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని, కేలరీలు త్వరగా బర్న్ అవుతాయని భావిస్తారు. మరోవైపు ఇంకొందరు యోగా శరీరం, మనస్సు రెండింటినీ ఆరోగ్యంగా ఉంచుతుందని నమ్ముతారు. అయితే, ఈ రెండింటిలో ఏది ఆరోగ్యానికి మంచిది, వాటి ఆరోగ్య ప్రయోజనాలేంటో, ముప్పై నిమిషాల పాటు వాకింగ్ లేదా యోగా చేస్తే ఏమవుతుందో ఇక్కడ తెలుసుకుందాం.



### గుండె ఆరోగ్యం



ప్రతి రోజూ ముప్పై నిమిషాలు నడవడం వల్ల హృదయ స్పందన రేటు తగ్గుతుంది. రక్తపోటు, గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి రోజూ వేగంగా నడిచే వారిలో గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం 30 శాతం తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.

### బరువు తగ్గవచ్చు



బరువు తగ్గడానికి వాకింగ్ బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. బరువు తగ్గడానికి సులభమైన, ప్రభావవంతమైన మార్గం వాకింగ్. ఒక సాధారణ నడక 150 నుంచి 200 కేలరీలను బర్న్ చేస్తుంది. వేగంగా నడిస్తే బర్న్ అయ్యే కేలరీల సంఖ్య మరింత పెరుగుతుంది. ప్రతి రోజూ క్రమం తప్పకుండా వాకింగ్ చేయడం వల్ల బరువు తగ్గవచ్చంటున్నారు నిపుణులు.

### డయాబెటిస్ పేషంట్లకు మేలు



ముప్పై నిమిషాల నడక వల్ల డయాబెటిస్ పేషంట్లకు మేలు జరుగుతుంది. నడక రక్తంలో చక్కెర స్థాయిల్ని నియంత్రిస్తుంది. టైప్–2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా రక్తపోటును సాధారణంగా ఉంచడంలో సాయపడుతుంది. రెగ్యులర్ వాకింగ్ స్ట్రోక్, ఇతర వ్యాధుల్ని కూడా నివారిస్తుంది.

### మానసక ఆరోగ్యానికి ఒక వరం



ఈ రోజుల్లో బిజీ లైఫ్‌స్టైల్, వర్క్ లైఫ్ కారణంగా చాలా మంది ఒత్తిడి, ఆందోళనతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికి వాకింగ్ బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ అరగంట నడవడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగపడుతుంది. రెగ్యులర్ వాకింగ్ వల్ల మెదడులో ఎండార్ఫిన్లు విడుదల అవుతాయి. ఎండార్ఫిన్లు మానసిక స్థితిని మెరుగుపర్చి.. ఒత్తిడిని తగ్గించడంలో సాయపడతాయి.

### శరీరాన్ని బలంగా మారుస్తుంది



యోగా చేయడం వల్ల శరీరం ఫ్లెక్సిబుల్‌గా మారుతుంది. అంతేకాకుండా రెగ్యులర్ యోగా వల్ల కండరాలు బలపడతాయి. శరీర భంగిమ కూడా మెరుగుపడుతుంది. వెన్నునొప్పి, మెడ నొప్పి, కీళ్ల నొప్పుల వంటి సమస్యలు ఉపశమనాన్ని యోగా అందిస్తుంది. యోగా చేయడం వల్ల ఈ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

### మానసిక ప్రశాంతత



యోగా శరీరానికి మాత్రమే కాకుండా మనసుకు కూడా విశ్రాంతినిస్తుంది. రోజూ యోగా చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. ఇది మానసిక ప్రశాంతతను ఇస్తుంది. ధ్యానం, ప్రాణాయామం చేయడం వల్ల మెదడు యాక్టివ్‌గా మారుతుంది. ఇది మిమ్మల్ని రోజంతా యాక్టివ్‌గా మారుస్తుంది.

### జీర్ణవ్యవస్థ మెరుగు



పవనముక్తసనం, భుజంగాసనం, వజ్రాసనం వంటి కొన్ని యోగా భంగిమలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. గ్యాస్, అసిడిటీ లేదా అజీర్ణం వంటి జీర్ణ సమస్యలతో బాధపడేవారికి యోగా బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. అంతేకాకుండా రోజూ యోగా చేయడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. జలుబు, అలెర్జీలు, ఇతర ఇన్ఫెక్షన్లు రాకుండా రోగనిరోధక శక్తి కాపాడుతుంది.

### రెండింటిలో ఏది బెస్ట్?



మీ లక్ష్యం బరువు తగ్గడం, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మధుమేహం వంటి వ్యాధులను నియంత్రించడం అయితే, నడక మరింత ప్రభావవంతంగా ఉంటుంది. మానసిక ప్రశాంతత, సౌకర్యవంతమైన శరీరం, అంతర్గత బలం కావాలంటే, యోగా ఉత్తమమైనది.

### రెండింటినీ కలపడం ఇంకా బెస్ట్



దినచర్యలో నడక, యోగా రెండింటినీ చేర్చుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఉదయం 15–20 నిమిషాలు యోగా చేసి, ఆపై 20–30 నిమిషాలు నడవండి. వారానికి 3 రోజులు యోగా, 3 రోజులు నడకను మీ జీవనశైలిలో భాగం చేసుకోండి. మీరు బిజీగా ఉండి సమయం తక్కువగా ఉంటే, ఈ రెండింటిలో ఏదైనా ఒక దాన్ని ఎంచుకుని క్రమం తప్పకుండా చేయండి.

గమనిక:ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.